## క్లుప్తంగా

### అద్దేపల్లి సర్విశెట్టి ఆదర్శనీయుడు



అద్దేపల్లి సర్విశెట్టి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నరసాపురం: స్త్రీ పునర్వివాహాల కోసం ఉద్యమించిన పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి ఆదర్శనీయుడని బీజీబీఎస్ మహిళా కళాశాల అధ్యక్షుడు నూలి వెంకటరమణమూర్తి అన్నారు. సర్విశెట్టి 118వ జయంతిని ఆయన స్థాపించిన బీజీబీఎస్ కళాశాల వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణమూర్తి మాట్లాడుతూ సర్విశెట్టి సేవలను కొనియాడారు. ముందుగా రాయిపేటలో ఉన్న సర్విశెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ట్రెజరర్ తుమ్మలపల్లి వీరభద్రరావు, కె.రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ మైలాబత్తుల సోని

నరసాపురం రూరల్: పట్టణంలో గత నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించగా అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంగళగుంటపాలెం గ్రామానికి చెందిన గోరింకల ఆలీవర్‌ను ఎంపీపీ మైలాబత్తుల సోని బుధవారం పరామర్శించారు. ఇదే ప్రమాదంలో మరణించిన ఆలీవర్ మేనత్త కుటుంబ సభ్యులను కూడా కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆలీవర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మైలాబత్తుల శ్రీను, వర్దను సుధాకర్, బండారి పెద్దిరాజు, పాలపర్తి రమేష్, పిల్లి నవరత్నం తదితరులు పాల్గొన్నారు.

### నల్ల బ్యాడ్జీలతో డాక్టర్ల నిరసన



నల్లబ్యాడ్జి ధరించి రోగికి సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకువచ్చిన జీఓను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్లు నిరసన వ్యక్తం చేస్తూ వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ తమ వైద్యవృత్తికి అన్యాయం చేసే జీఓ-85ను రద్దు చేయాలని కోరారు. గత కొన్ని నెలలుగా ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించుకుంటున్నా స్పందించకపోవడంతో రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నిరసన తెలిపామన్నారు. ప్రభుత్వం స్పందించి జీఓ-85ను రద్దు చేయాలని కోరారు.

### విద్యార్థులకు నవోదయ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నవోదయ పుస్తకాలు అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: నవోదయ ఎంట్రన్స్ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని దాత శిఖాకొల్లు కామేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారం అందించడంలో తనవంతు కృషి చేస్తానని అన్నారు. హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కరణం పాపారావు, సున్నం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

### వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లికి చెందిన గద్దం గనిరాజు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అలాగే నరసాపురం మండలం లక్ష్మణేశ్వరానికి చెందిన ఎం.సుబ్బారావు అంగవైకల్యంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు వీరికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని బుధవారం ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు.

# రెగ్యులేటర్ నిర్మాణం పూర్తయ్యేనా..?

**దర్బరేవు డ్రెయిన్ కారణంగా ఏళ్లుగా నీటమునుగుతున్న పంట పొలాలు**



కొత్తకాయలతిప్పలో రెగ్యులేటర్ నిర్మించాల్సిన ప్రాంతం

మొగల్తూరు: మండలంలోని దర్బరేవు డ్రెయిన్ వల్ల రైతులు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పొలాల్లో నీరు నిలిచిపోవడంతో సాగు విషయంలో రైతన్నలు వెనకడుగు వేస్తున్నారు. సాధారణంగా మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో ప్రారంభమై మోడి, మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప మీదుగా నరసాపురం మండలం పసలదీవి నుంచి అదే మండలం దర్బరేవులో కలుస్తుంది. అయితే ఈ దర్బరేవు డ్రెయిన్ ఆటుపోటుల కారణంగా వర్షపు నీరు కూడా చేలల్లోకి చేరుతుంది. దీంతో దర్బరేవు డ్రెయిన్ ఆయకట్టు భూములు ఏడాది పొడవునా ముంపులోనే ఉండటంతో రెగ్యులేటర్ నిర్మించాలని 2016లోనే నిర్ణయించారు. దర్బరేవు డ్రెయిన్‌కు కొత్తకాయలతిప్ప వద్ద అడ్డుకట్టవేసి రెగ్యులేటర్ పనులు చేపడతామని అప్పటి జిల్లా కలెక్టర్ హామీఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా పనులు ప్రారంభంకాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఇప్పటికైనా రెగ్యులేటర్ నిర్మిస్తారని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు.

**ప్రతి ఏటా వేలాది ఎకరాలు ముంపు**

దర్బరేవు డ్రెయిన్ పొడవునా ప్రతీ ఏటా సుమారు 5 వేల ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి. దీంతో చేతికొచ్చిన పంట మునిగిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దర్బరేవు డ్రెయిన్‌పై కొత్తకాయలతిప్ప వద్ద రెండు దశాబ్దాల క్రితం తూరలు ఏర్పాటు చేశారు. తూరలు శిథిలస్థితికి చేరడంతో పాటు ఆయకట్టు రైతులు ఎవరికి వారు సొంతంగా తమ భూములకు తూరలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో డ్రెయిన్ ఆటుపోటులకు, భారీ వర్షాలకు నీరు వ్యవసాయ భూముల్లోకి చేరి నిలిచిపోతుంది. రోజుల తరబడి నిలిచిపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముంపు కారణంగా కొంత మంది రైతులు రెండు పంటలూ నష్టపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు.

**అనధికార తూరలతో ఇబ్బంది**

మొగల్తూరు మండలం ముత్యాలపల్లి నుంచి నరసాపురం మండలం దర్బరేవువరకు డ్రెయిన్ ప్రవహిస్తుంది. డ్రెయిన్ పొడవునా అనధికార తూరలు ఏర్పాటు చేసుకోవడం, గతంలో ఏర్పాటు చేసిన తూరలు శిథిలస్థితికి చేరడం వల్ల చేలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రైతులు అనేకసార్లు ఆందోళనలు చేయడం, అధికారులు పర్యటించి వెళ్లిపోవడం తప్ప సమస్య పరిష్కారం కావడంలేదు. అయితే 2016 జూలై, ఆగష్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు చేలు ముంపున కు గురవడంతో రైతులు సాగు చేపట్టడం మానివేశారు. తిరిగి అదే ఏడాది వార్దా తుఫాన్ కారణంగా సముద్రపు పోటుకు దర్బరేవు డ్రెయిన్ పొంగి కొత్తకాయలతిప్పతో పాటు రామన్నపాలెంలోని అడవిపర్ర భూములన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో చప్పనీరు స్థానంలో ఉప్పునీరు రావడంతో ఆకుమడులు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి కొత్తకాయలతిప్ప వద్ద శిథిలావస్థకు చేరుకున్న తూరలు తొలగించి రెగ్యులేటర్ నిర్మించాలని నిర్ణయించారు. రెగ్యులేటర్ నిర్మాణానికి సుమారు రూ. 3 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేసినా పనులు ముందుకు కదల్లేదు. ఇప్పటికీ నాయకులు, అధికారులు స్పందించి దర్బరేవు డ్రెయిన్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రలో చేలల్లో నిలిచిన నీరు

**సాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు**



ఇప్పటికే రెండు సార్లు నాటు వేసుకున్న రైతులు అధిక వర్షాలు తోడు డ్రెయిన్ నీరు చేలల్లోకి చేరడంతో ఆర్థికంగా నష్టపోయారు.రెండు సార్లు నాట్లు వేసినా అవి మునిగిపోయాయి. రైతుల సమస్య పరిస్కారం కావాలంటే రెగ్యులేటర్ నిర్మించాలి.

– బందెల ఏలిషా, సర్పంచ్, రామన్నపాలెం

**300 ఎకరాల్లోనే సాగు**

మొగల్తూరు మండలంలో దర్బరేవు డ్రెయిన్ సమస్య చాలా ఏళ్లుగా ఉంది. ముఖ్యంగా రామన్నపాలెం పంచాయతీలో గతంలో 1800 ఎకరాలు సాగు చేస్తే ప్రస్తుతం 300 ఎకరాలు కూడా లేదు. ఏడాది పొడవునా చేలో నీరుండడంతో రెండు పంటలూ నష్టపోతున్నారు.దీంతో సాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

– అబ్దుల్ రహీమ్, మండల వ్యవసాయాధికారి

# ఆకుకూరల్లో అనేక రకాల పోషక విలువలు



పాలకొల్లు అర్బన్: బల్లిపాడుగరువులో ఆకుకూరల ప్రాధాన్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మంగ

పాలకొల్లు అర్బన్: ఆకుకూరల్లో అనేక రకాల పోషక విలువలు ఉన్నాయని ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఎక్కువగా ఆకుకూరలు తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ కోరారు. మండలంలోని బల్లిపాడుగరువులో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, బాలింతలు, గర్భిణులు, కిషోరబాలికలకు అవగాహన కల్పించారు. ఆకుకూరల్లో మునగ ఎక్కువగా తీసుకోవాలని, వీటిలో ఐరన్ శాతం ఎక్కువగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవి, ఏఎన్ఎం టి.శార, అంగన్‌వాడీ టీచర్లు జె.గనికమ్మ, కె.సునీత పాల్గొన్నారు. అలాగే లయన్స్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం డి.సరళాప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్ డి.లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

**నరసాపురంలో..**

నరసాపురం రూరల్: పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహనను కలిగి ఉండాలని సీడీపీఓ ఊర్మిల, హెచ్ఎం మేరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పేర్కొన్నారు. మండలంలోని చినమామిడిపల్లి కొత్తకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన పోషణ్ మహాన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.



నరసాపురం రూరల్: కొత్తకాలనీలో పోషణ్ మహాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

# సహజ యోగాతో ఏకాగ్రత సాధ్యం



పెనుగొండలో సహజ యోగాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుగొండ: మానసిక ఒత్తిడి తగ్గి చదువుపై ఏకాగ్రత పెరిగేందుకు సహజ యోగా ధ్యానం దోహద పడుతుందని సహజ యోగా ట్రస్ట్ ఏపీ కమిటీ సభ్యుడు అప్పన హనుమంతురావు(బుజ్జి) అన్నారు. బుధవారం సహజ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పెనుగొండ విశ్వతేజ కళాశాలలో సహజ యోగాపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడితో ప్రతిచోటా విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. చిన్నతనం నుంచి సహజ యోగా ధ్యానం క్రమం తప్పకుండా అలవర్చుకొంటే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పులిగెడ్డ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటరు వీఎస్వీ సతీష్, చుండూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సికిలే మోజస్ మృతి



మోజస్ (ఫైల్)

నరసాపురం: నరసాపురం ప్రాంతంలోని సికిలే విద్యాసంస్థల చైర్మన్ మోజస్ జోసఫ్ సికిలే (76) అనారోగ్యంతో బుధవారం చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 40 ఏళ్ల క్రితం మోజస్ నరసాపురంలో సికిలే విద్యాసంస్థలను స్థాపించారు. ఓ వైపు విదేశాల్లో పలు వ్యాపారాలు నిర్వహిస్తూ మోజస్ ఆయన సోదరుడు సికిలే పెర్సిపాల్‌తో కలసి పట్టణంలో సికిలే సంస్థలను విజయవంతంగా నడిపారు. మోజస్ మృతికి ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ తదితరులు సంతాపం తెలిపారు.

# గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవాల జోరు



పెనుగొండ: సిద్ధాంతంలో ఆకట్టుకుంటున్న చౌదరీ రామాలయ గణపతి ఉత్సవ రథం

పెనుగొండ: గణపతి నవరాత్రులు సందర్భంగా పెనుగొండ, ఆచంట మండలాల్లో నిమజ్జనాల జోరందుకొన్నాయి. ఐదోరోజు బుధవారం వాడవాడలా గ్రామోత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. గ్రామోత్సవాలు అనంతరం పెనుగొండ మండలంలో సిద్ధాంతం వశిష్టా గోదావరిలోనూ, ఆచంట మండలం కోడేరులోనూ గణేష్ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధాంతం చౌదరి సంఘం ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక గరిక పూజలు నిర్వహించిన అనంతరం గణపతి విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. అలాగే సీతమ్మ కాలనీలో పూజా కార్యక్రమాలు అనంతరం గణపతిని చలువ పందిరి నుంచి ప్రత్యేక వాహనంపై ఊరేగిస్తూ కనులపండువగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. వడలి కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమ్మజ్జనోత్సవం వడలి నుంచి సిద్ధాంతం వరకూ నిర్వహించారు. వడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వశిష్టా గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈనెల 14న భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సిద్ధాంతం వశిష్టా గోదావరి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కే గంగాధర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**మొగల్తూరులో..**

మొగల్తూరు: గణపతి నవరాత్రులను గత అయిదు రోజులుగా ఘనంగా నర్వహిస్తున్నారు. మండలంలోని పలు ప్రాంతాలలో వినాయక చవితి రోజున, మరి కొన్ని ప్రాంతాలలో రెండో రోజున వినాయకుని నిమజ్జనాలు నిర్వహిచారు. మొగల్తూరు ట్రక్కు ఆటో , పాసెంజర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలోను, స్థానిక సత్రవు పాలెంలో నెలకోల్పిన వినాయకున్ని బదవారం నిమజ్జనాలు చేశారు. తీన్ మార డప్పులు, విచిత్ర వేషదారణలు, బాణ సంచాకాల్పులతో స్వామి వారిని గ్రామంలోని ప్రధాన వీదులు గుండా ఊరేగించి వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు.



పెనుగొండ: సీతమ్మ కాలనీ వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



మొగల్తూరు: ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

# చంద్రబాబు స్వార్థానికి విజయవాడ బలి



గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వార్థానికి విజయవాడ నగరవాసులను నట్టేటముంచారని పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయంటే ముందస్తుగానే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. దాంతో ప్రభుత్వం వెంటనే అప్రమత్తం అయ్యిలోతట్టు ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించడం వారిని హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు చేరవేయాల్సి ఉంటుంది. కానీ విజయవాడలో బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా నీటిని వదిలితే ప్రమాదం జరుగుతుందని తెలిసినా తమ స్వార్థం కోసం బాబు ఇల్లు, ఏబీఎన్ రాధాకృష్ణల పవర్ ప్లాంట్ మునిగిపోతున్నాయని తెలిసి అర్ధరాత్రి నీటిని వదిలే దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. అయితే పోయేది ప్రజలే కదా అనే ఉద్దేశంతో ముందస్తు సమాచారం లేకుండా బాబు సూచనలతో అర్ధరాత్రి నీటిని వదిలారని మండిపడ్డారు. ప్రభుత్వంపై నమ్మకం లేకనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నించారని ఈ ప్రయత్నంలో చాలా మంది మృత్యువాత పడడం చాలా బాధాకరమన్నారు. ఆహారం అందిస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నా శివారు ప్రాంతాల్లో, మూడు, నాలుగో అంతస్తుల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఆహారపానీయాలు అందలేదనేది అక్షరసత్యమన్నారు. బాధితులకు అందిన సహాయంలోకూడా ప్రభుత్వ ప్రమే యం పెద్దగా ఏమి లేదన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థల సభ్యులు వచ్చి ఆహార పానీయాలు పంపిణీ చేశారన్నారు. బాబు ప్రభుత్వం ప్రచార ఆర్భాటమే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. భజన చేసే మీడియాతో ప్రెస్‌మీట్లు పెట్టి బాబు ప్రచారానికే అధిక ప్రాధాన్యతనిచ్చారని విమర్శించారు. కరోనా వంటి ప్రమాద సమయాల్లో, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరదల సయమంలోనూ వలంటీర్లు తమ ప్రాణాలకు తెగించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవారన్నారు. అలాంటి వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి నేడు ప్రజలను నట్టేట ముంచారని మండిపడ్డారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసే పని 10 శాతం ఉంటే ప్రచారంలో మాత్రం బాబును మించిపోయేలా 100 శాతం ఉంటుందన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో కూడా ప్రచార ఆర్భాటంగానే చిత్రీకరించే దుస్థితి టీడీపీ నేతలకే చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



ముత్యాలవారిపుంతలో రేషన్ బియాన్ని స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని యాళ్లవానిగరువు శివారు ముచ్చర్లవారిపుంతలో అక్రమంగా నిలువ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. తనకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి ముచ్చర్లవారిపుంతలో తాడి చిన్న అబ్బులు అద్దెకు ఉంటున్న ఇంటిపై దాడి చేయగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. వీటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు దీనిపై చిన్నఅబ్బులను ప్రశ్నించగా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి మోటార్‌సైకిల్‌పై ఇంటింటికి తిరిగి రూ.16 చెల్లించి కొనుగోలు చేశానని, వీటిని కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్శిపూడి గ్రామానికి చెందిన పి.గంగరాజుకి రూ.20 చొప్పున విక్రయిస్తానని చెప్పడంతో వీరు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడిలో విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఏఓ పి.సురేష్ పాల్గొన్నారు.

# జీఓ-115ను రద్దు చేయాలి



పాలకొల్లు ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

పాలకొల్లు అర్బన్: సుమారు 18 ఏళ్ల నుంచి ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా ఏఎన్ఎంలకు 18 నెలల శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం-115ను తక్షణం రద్దు చేయాలని కోరుతూ బుధవారం పాలకొల్లు ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. 13 నుంచి 16 వరకు అత్యవసర విధులు మినహాయించి ఓపీ విధులు, సాధారణ వార్డు విధులు బహిష్కరణ చేసి రిలే దీక్షల్లో పాల్గొంటామని స్టాఫ్ నర్సులు విలేకరులకు తెలిపారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ విధులతో పాటు అత్యవసర విధులు కూడా బహిష్కరించి నిరవధిక దీక్షల్లో పాల్గొంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి జీవో నెం-115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి 18 నెలలు శిక్షణ ఇచ్చి జీఎన్ఎం స్టాఫ్ నర్సు ఉద్యోగాలు ఇవ్వడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనూరాధ, సునీత, విజయకుమారి, స్వప్న, వెంకటేశ్వరమ్మ, సుజాత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రాంతం పరిశీలన



కొత్తనవరసపురం ఎస్టీ కాలనీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: భద్రాచలంలో వరద ఉధృతి తగ్గుముఖం పడుతుండడంతో నరసాపురంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. మండలంలోని కొత్తనవరసపురం ఎస్టీ కాలనీలోకి బుధవారం కొంతమేర వరదనీరు చేరింది. అప్రమత్తమైన రెవెన్యూ యంత్రాంగం పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వరద పరిస్థితిని తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ బెజవాడ సీతారత్నం వరద ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇప్పటి వరకూ 11 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. 600 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లడంతో 1,008 మంది రైతులు నిరాశ్రయులయ్యారన్నారు. గురువారం నాటికి వరద పూర్తిగా తగ్గవచ్చని ఆమె తెలిపారు. వీరి వెంట వీఆర్ఓ కొప్పిసెట్టి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

### వరద బాధితులకు ఆర్థిక సాయం



కలెక్టరు నాగరాణికి విరాళం అందిస్తున్న ఆచంట వేమవరం ఉపాధ్యాయులు

పెనుగొండ: విజయవాడ వరద బాధితులకు ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రూ.50, 700 ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణికి అందించారు. బుధవారం భీమవరంలో ఆర్‌జేడీ సమక్షంలో విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు సుధాకర్, స్కూల్ చైర్మన్ గుత్తుల చిరంజీవిలు పాల్గొన్నారు,